




APTEL/2015/65279

# V న్యూస్

మన ఊరు - మన వార్తలు

తెలుగు దినపత్రిక

e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com

Postal Reg.No. MPM/L22/VNEWS/22-24








సంపుటి : 11 సంచిక : 142 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, ఏలూరు, గుంటూరు, ఖమ్మం, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి నెల్లూరు సోమవారం 08 - 12- 2025 పేజీలు : 8 వెల : రూ.3 /-




## ఆరో రోజు


# 650 విమానాలు

- ★ కొనసాగిన విమానాల రద్దు పర్వం
- ★ మరోవైపు పెరిగిన విమానరాకపోకల సంఖ్య
- ★ దేశవ్యాప్తంగా ప్రయాణికులకు కాస్తంత ఊరట
- ★ త్వరలో పార్లమెంటరీ కమిటీ విచారణ!
- ★ రాజస్తాన్ పర్యాటకానికి ఎదురుదెబ్బ
- ★ ఇండిగో విమానంలో పావురం కలకలం
- ★ ప్రయాణికులకు రూ.610 కోట్లు రీఫండ్

ఇండిగో సంక్షోభం ఆరో రోజు సైతం కొనసాగింది. ఆదివారం ఒక్కరోజే మరో 650 విమానాలు రద్దయ్యాయి. ఢిల్లీలో 118, ముంబైలో 121 విమానాలు రద్దయ్యాయి. శుక్రవారం, శనివారంతో పోలిస్తే పరిస్థితి చాలావరకు అదుపులోకి వచ్చినట్లు ఇండిగో వర్గాలు వెల్లడించాయి. అయితే ఆరో రోజు ప్రయాణికులకు కొంత ఊరట లభించింది. విమానాల సంక్షోభం క్రమంగా కుదుటపడుతున్న సంకేతాలు కనిపించాయి. దేశీయ, అంతర్జాతీయ సర్వీసులకు సంబంధించి మొత్తం 2,300 విమానాలకుగాను ఆదివారం 1,650 విమానాలు రాకపోకలు సాగించాయి. ఈ నెల 10వ తేదీ కల్లా సాధారణ పరిస్థితులు నెలకొంటాయని, విమానాలు యథాతథంగా రాకపోకలు సాగిస్తాయని, ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాయి. ప్రయాణికులతో పాటు ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేయడంతో ఇండిగో యాజమాన్యం నష్టనివారణ చర్యలు ప్రారంభించింది. పరిస్థితిని చక్కదిద్దడానికి నడుం బిగించింది. ఇండిగో సిబ్బందిని ఉద్దేశించి సంస్థ సీఈఓ పీటర్ ఎల్బెర్స్ ఒక వీడియో సందేశం విడుదల చేశారు. ఒక్కో అడుగు వేసుకుంటూ సాధారణ స్థితికి చేరుకుంటున్నామని తెలిపారు.

# నేడు వందేమాతరంపై లోక్‌సభలో చర్చ

- ♦ వెలుగులోకి రాని కీలక విషయాలు వెల్లడించేందుకే !
- ♦ 150 ఏళ్ల వేడుకల్లో భాగంగానే.. రేపు రాజ్యసభలోనూ
- ♦ రేపటి నుంచి సర్ సహా ఎన్నికల సంస్కరణలపై చర్చ





# గోవాలోని నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం..!

- ★ 25 మంది మృతి
- ★ బిర్చ్ నైట్‌క్లబ్ లో అర్ధరాత్రి అగ్నికీలలు
- ★ బాణసంచా పేలుడుతో క్షణాల్లో వ్యాపించిన మంటలు
- ★ ఇరుకుదారిలో బయటకు వెళ్లలేకపోయిన బాధితులు
- ★ బేస్‌మెంట్‌లో చిక్కుకుని ఊపిరాడక పలువురి మృతి
- ★ మృతుల్లో నలుగురు పర్యాటకులు, 14 మంది సిబ్బంది
- ★ 7 మృతదేహాల్ని గుర్తించాల్సి ఉందన్న గోవా పోలీసులు
- ★ క్లబ్ యజమానులు, మేనేజర్‌పై క్రిమినల్ కేసు నమోదు
- ★ మృతుల కుటుంబాలకు గోవా సర్కారు రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా

గోవాలోని ఓ నైట్‌క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 25 మంది మరణించారు. ఆరుగురు గాయపడ్డారు. ఉత్తర గోవాలోని అర్పోరా-నగావ్ గ్రామంలో అర్పోరా నది ఒడ్డున ఉన్న బిర్చ్ బై రోమియో లేన్ అనే నైట్‌క్లబ్‌లో ఒక్కసారిగా పేలుడు సంభవించి క్షణాల్లోనే మంటలు వ్యాపించాయి. దీంతో మంటల్లో చిక్కుకుని కొందరు, దట్టమైన పొగకు ఊపిరాడక మరికొందరు మరణించారు. మృతుల్లో నలుగురు పర్యాటకులు, 14 మంది క్లబ్ సిబ్బందిని గుర్తించారు. మరో 7 మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. క్లబ్‌లో బాణసంచా పేలడంతో ఈ ప్రమాదం జరిగిందని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ప్రకటించారు. నిబంధనలు అతిక్రమించి, ఏమాత్రం భద్రతా చర్యలు తీసుకోకుండా క్లబ్‌ను నిర్వహించటమే ప్రమాదానికి కారణమని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో క్లబ్ మేనేజర్, ఈవెంట్ ఆర్గనైజర్లతోపాటు ఇద్దరు యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా క్లబ్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారన్న ఆరోపణలతో అర్పోరా-నగావ్ గ్రామ సర్పంచ్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, గోవా సీఎం ప్రమోద్ తదితరులు సంతాపం తెలిపారు.

**ఆనందం క్షణాల్లో ఆవిరై..!**

గోవా రాజధాని పనాజీకి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న అర్పోరా గ్రామంలోని బిర్చ్ బై రోమియో లేన్ నైట్ క్లబ్.. రాత్రి ఒంటిగంట సమయంలో క్లబ్‌లోని మొదటి అంతస్తులో ఉన్న డ్యాన్స్ హాల్‌లో ఉషారెక్కించే సంగీతం మారుమోగుతోంది.. దాదాపు వందమంది కేరింతలు కొడుతూ ఆనందంగా గడుపుతున్నారు. అప్పుడే వేదిక వెనుకవైపున పైకప్పు నుంచి చిన్నగా మంట మొదలై.. క్షణాల్లోనే హాలంతా మంటలు పాకాయి.




V న్యూస్
మన ఊరు - మన వార్తలు
తెలుగు దినపత్రిక

సోమవారం 08 డిసెంబర్ 2025

# ఆరో రోజు

# 650 విమానాలు

ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్(సీఎంజీ)ను ఏర్పాటు చేసింది. ఇండిగో విమానాల రాకపోకలకు సంబంధించి తాజా పరిణామాలను ఈ గ్రూప్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది.

**త్వరలో పార్లమెంటరీ కమిటీ విచారణ!**

ఇండిగో సంక్షోభంపై ఆ సంస్థ ప్రతినిధులతోపాటు డీజీసీఏ అధికారులను, విమానయాన శాఖ అధికారులను పిలిపించి విచారించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం నిర్ణయించింది. త్వరలో వారికి సమన్లు జారీ చేయబోతున్నట్లు సమాచారం. పెద్ద సంఖ్యలో విమానాలు రద్దు కావడం, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోవడాన్ని పట్ల సంజయ్ ఝా నేతృత్వంలో రవాణా, పర్యాటకం, సంస్కృతిపై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తీవ్రంగా పరిగణిస్తోంది. ఆయా అధికారులను పిలిపించి ప్రశ్నించడంతోపాటు భవిష్యత్తులో ఇలాంటి సమస్య తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సంక్షోభానికి మూల కారణాలపై విశ్లేషణ ప్రారంభించినట్లు ఇండిగో వర్గాలు పేర్కొన్నాయి.

**రాజస్తాన్ పర్యాటకానికి ఎదురుదెబ్బ**

రాజస్తాన్‌కు ప్రతిఏటా డిసెంబర్‌లో పర్యాటకులు భారీగా తరలివస్తుంటారు. ఇండిగో సంక్షోభం వల్ల గత ఆరు రోజులుగా ప్రముఖ పర్యాటక ప్రాంతాలు వెలవెలబోతున్నాయి. విమానాలు అందుబాటులో లేక పర్యాటకులు రావడం లేదు. చాలామంది తమ పర్యటనలు రద్దు చేసుకున్నారు. కొందరు వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సీజన్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నామని, పర్యాటకులు రాకపోవడంతో చాలా నష్టపోతున్నాయని రాజస్తాన్‌లోని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హెూటళ్లు, దుకాణాలు, రవాణా రంగాల్లో వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. వీరందరికీ దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులే జీవనాధారం.

**ఇండిగో విమానంలో పావురం కలకలం**

ఇండిగో విమానం టేకాఫ్‌కు సిద్ధమవుతున్న సమయంలో అందులో పావురం కనిపించడం తీవ్ర కలకలం సృష్టించింది. బెంగళూరు నుంచి వడోదరకు బయలుదేరిన విమానంలో ఈ ఘటన జరిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. తాజాగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. సరిగ్గా టేకాఫ్‌కు ముందు పావురం విమానంలో ఎగరడం చూసి ప్రయాణికులు, సిబ్బంది ఆశ్చర్యానికి గురయ్యారు. దాన్ని పట్టుకోవడానికి ప్రయత్నించారు. వారి చేతికి చిక్కకుండా చాలాసేపు అటుఇటూ ఎగురుతూ కనిపించింది. బయటపడేందుకు ప్రయత్నించింది. ప్రయాణికుల్లో ఒకరు ఈ దృశ్యాన్ని చిత్రీకరించి, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. ఇండిగోకు బ్యాడ్‌టైమ్ కొనసాగుతోందని కొందరు పేర్కొన్నారు. పావురానికి 'బర్డింగ్ పాసు' ఉంది కాబోలు, అందుకే లోపలికి వచ్చిందని ఒకరు చమత్కరించారు.

**ప్రయాణికులకు రూ.610 కోట్లు రీఫండ్**

రద్దయిన, ఆలస్యంగా నడిచిన విమానాలకు సంబంధించి ప్రయాణికులకు ఇండిగో యాజమాన్యం శనివారం నాటికి రూ.610 కోట్లు రీఫండ్ చేసినట్లు విమానయాన శాఖ ఆదివారం వెల్లడించింది. అలాగే బ్యాగేజీని కూడా వెనక్కి ఇచ్చినట్లు తెలిపింది. ప్రయాణికులకు టిక్కెట్ల సొమ్మును ఆదివారం రాత్రి 8 గంటలకల్లా పూర్తిగా చెల్లించాలని ఇండిగోను కేంద్ర ప్రభుత్వం ఆదేశించి సంగతి తెలిసిందే. అలాగే బ్యాగేజీని 48 గంటల్లోగా అందజేయాలని పేర్కొంది. సంక్షోభంపై వివరణ ఇవ్వడానికి ఇండిగో సీఈఓ పీటర్ ఎల్‌బెర్స్, అకౌంటబుల్ మేనేజర్ ఇసిడ్రో పోర్కిరస్‌కు మరికొంత సమయం ఇవ్వాలని డీజీసీఏ ఆదివారం నిర్ణయించింది. సోమవారం సాయంత్రంకల్లా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

# 15 ఏళ్లు కూటమే విడాకులు ఉండవ్: లోకేశ్

**బాబు ముందుచూపున్న నేత..**

చంద్రబాబు ఐటీని పరిచయం చేశాక హైదరాబాద్ రూపుమారిపోయింది. ఈరోజు బెంగళూరుకు పోటీ ఇస్తోంది. గతంలో ఐటీ.. ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీ. చంద్రబాబు ముందుచూపు ఉన్న నాయకుడు. తెలుగుజాతికి అది అదృష్టం. ఏ దేశానికి వెళ్లినా.. ఏ కంపెనీకి వెళ్లినా సాదర స్వాగతం పలుకుతున్నారంటే కారణం చంద్రబాబు. కార్యకర్తలే టీడీపీ బలం. వారి త్యాగాలను గుర్తు పెట్టుకుంటాం. మెడపై కత్తిపెట్టినా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అని నినదించి ప్రాణాలు కోల్పోయిన తోట చంద్రయ్య.. స్థానిక ఎన్నికల్లో పుంగనూరులో మీసాలు మెలేసి, తొడగొట్టిన అంజిరెడ్డి తాత నాకు స్ఫూర్తి. రక్తం కారుతున్నా చివరి ఓటు వేసే వరకు బూత్‌లో నిలబడిన మంజులారెడ్డికే లోకేశ్ అండ. జై తెలుగుదేశం అన్నందుకు విజయవాడలో గాంధీ కంటిచూపు పోగొట్టుకున్నారు. అధికార గర్వంతో వై నాట్ 175 అన్నారు. ప్రజలు వై నాట్ 11 అన్నారు. చివరకు ఆ పార్టీని భూస్థాపితం చేశారు.

**స్వరాష్ట్రంపై మీకు ప్రేమ..**

అందరూ మిమ్మల్ని ఎన్ఆర్ఐలు అంటారు. కానీ మీరు ఎంఆర్ఐలు.. మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్. మీరు అమెరికాకు వచ్చి దశాబ్దాలు గడిచినా మీ మనసు ఎప్పుడూ ఏపీ వైపే చూస్తుంది. మీ ఊరి వైపు ఉంటుంది. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు పెద్దఎత్తున బయటకు వచ్చారు. సొంత రాష్ట్రంపై ప్రేమ ఉంది కాబట్టే.. ఎన్నికలకు 6నెలలు, ఏడాది ముందు వచ్చి ఏ పదవీ.. డబ్బు ఆశించకుండా మాకు అండగా నిలిచారు. అందుకే ఎప్పుడూ లేని విధంగా 94 శాతం సీట్లు కూటమి కైవసం చేసుకుంది. రాబోయే రోజుల్లో ఈ రికార్డులు తిరగరాస్తాం.

**రెడ్‌బుక్ తన పని తాను చేసుకుపోతుంది**

రెడ్‌బుక్ తన పని తాను చేసుకుంటూపోతోంది. చట్టాన్ని ఉల్లంఘించిన ఎవరినీ వదిలిపెట్టేది లేదు. మేం ఎలాంటి కక్ష సాధింపులకూ పాల్పడడం లేదు. నా తల్లిని అవమానించిన వారిని వదిలిపెట్టను. మీ తల్లిని అవమానించినా వదిలిపెట్టను. అయితే వారు అవమానించారని మనం అవమానించకూడదు. స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం.

**పేరుపేరునా ధన్యవాదాలు..**

సమావేశానికి హాజరైన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు లోకేశ్ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తాను అమెరికాలో నాలుగేళ్లు అండర్ గ్రాడ్యుయేషన్ చేశానని, రెండేళ్లు వాషింగ్టన్ డీసీలో ప్రపంచ బ్యాంకులో పనిచేశానని తెలిపారు. స్టాన్‌ఫోర్డ్‌లో ఎంబీఏ చేశానని.. సుమారు 9ఏళ్లు ఇక్కడ ఉన్నానని, కానీ ఎన్నడూ లేని విధంగా ఈసారి డాలస్‌లో అడుగుపెట్టిన దగ్గర నుంచీ ఈ కార్యక్రమం వరకు తనకు ఘనస్వాగతం పలకడం మరచిపోలేనని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని చూస్తుంటే యువగళం నాటి రోజులు గుర్తుకు వస్తున్నాయన్నారు. ఈ సమావేశాన్ని చూసిన తర్వాత టీమ్ 11కి నిద్రపట్టదని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో రాష్ట్రప్రభుత్వ ప్రవాసాంధ్ర వ్యవహారాల సలహాదారు, ఏపీఎన్ఆర్‌టీ సొసైటీ అధ్యక్షుడు వేమూరి రవికుమార్, ఎన్ఆర్ఐ టీడీపీ యూఎస్ఏ కో-ఆర్డినేటర్ కోమటి జయరాం, టెక్సాస్‌లోని గార్లాండ్ నగర మేయర్ డైలాన్ హెడ్రిక్ తదితరులు పాల్గొన్నారు.

# గోవాలోని నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం...!

క్లబ్‌లోనివారంతా ఒక్కసారిగా బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఇరుకు దారిలో వెళ్లలేక కొందరు బేస్‌మెంట్‌లో ఉన్న వంటగదిలోకి వెళ్లారు. వారంతా ఊపిరాడక మరణించారని పోలీసులు తెలిపారు. రాత్రిపూట వేడుకలకు ఉత్తర గోవా ప్రాంతంలో బిర్చ్ క్లబ్ చాలా ప్రసిద్ధి. నిత్యం వందలాది మంది క్లబ్‌కు వస్తారు. అయితే, ఈ క్లబ్ నిర్మాణంలోగానీ, నిర్వహణలోగానీ ఏమాత్రం నిబంధనలు పాటించలేదని పోలీసుల విచారణలో తేలింది. లోపలికి వె ళ్లేందుకు, బయటకు వచ్చేందుకు దారులు చాలా ఇరుకుగా ఉన్నాయి. క్లబ్ భవనం జీవితకాలం ముగిసిపోవటంతో కూల్చివేయాలని గ్రామపంచాయతీ కార్యాలయం నోటీసులు కూడా ఇచ్చింది. అయినా క్లబ్‌ను నిర్వహిస్తున్నారు. అందులో పనిచేసే ఉద్యోగుల్లో చాలామంది అర్పోరా గ్రామ వాసులు ఉండగా, కొందరు జార?ండ్, అస్సాం రాష్ట్రాల వారు ఉన్నారు. మృతుల్లో కూడా వీరే అధికంగా ఉన్నారు. ప్రమాదంపై గోవా సీఎం ప్రమోద్ సావంత్ మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడినవారికి రూ.50వేలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది.

**సిలిండర్లు పేలలేదు: గోవా డీజీపీ**

మంటలు అంటుకోవటానికి ముందు క్లబ్‌లో భారీ పేలుడు సంభవించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో వంటగదిలో గ్యాస్ సిలిండర్ పేలి ఉండొచ్చని పోలీసులు మొదట భావించారు. అయితే, వంటగదిని పరిశీలించగా సిలిండర్లన్నీ సురక్షితంగా ఉన్నాయని గోవా డీజీపీ అలోక్‌కుమార్ ఆదివారం తెలిపారు. పేలుడుపై దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. అగ్నిప్రమాదంలో క్లబ్ మొత్తం కాలిపోయింది. మంటలు క్షణాల్లోనే క్లబ్ మొత్తం వ్యాపించాయని పోలీసులు తెలిపారు. అగ్నిప్రమాద సమాచారం అందుకొని అగ్నిమాపక శకటాలు అక్కడికి వెళ్లినా.. దారి ఇరుకుగా ఉండటంతో క్లబ్‌కు 400 మీటర్ల దూరంలోనే ఆగిపోవాల్సి వచ్చిందన్నారు.

# శ్రీశైలానికి డేంజర్ బెల్స్

శ్రీశైలం జలాశయం ప్రమాదపుటంచుల్లో ఉందని.. ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీగొయ్యి విస్తరించడం.. ఆనకట్ట రక్షణకు అమర్చిన 62 సిలిండర్లు దెబ్బతినడం ప్రమాద సంకేతాలని అధ్యయన సంస్థలు తమ నివేదికల్లో స్పష్టం చేశాయి. 2009 అక్టోబరులో 25.5 లక్షల క్యూసెక్కుల అతిభారీ వరద రావడంతో ప్రాజెక్టు దెబ్బతింది. 2014 సెప్టెంబరు 23న ఢిల్లీలో కేంద్ర జలవనరుల శాఖ శ్రీశైలం డ్యాం సహా వివిధ ప్రధాన ప్రాజెక్టుల భద్రతా, నిర్వహణ లోపాలపై సమీక్షించింది. ఆ తర్వాత పదేళ్లలో కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ డాక్టర్ వైకే మూర్తి, సీడబ్ల్యూసీ మరో మాజీ చైర్మన్, డ్యాం భద్రత నిపుణుడు ఏబీ పాండ్యా, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ మాజీ, ప్రస్తుత చైర్మన్లు వివేక్ త్రిపాఠి, అనిల్ జైన్ సహా అనేకమంది నిపుణులు, ప్యానెళ్లు, కమిటీలు ప్రాజెక్టును సందర్శించాయి. పలు లోపాలు ఎత్తు చూపుతూ డ్యాం భద్రతకు తీసుకోవలసిన చర్యలపై పలు సూచనలు చేశాయి. డ్యాం దిగువన ఏర్పడిన ప్లంజ్‌పూల్ భారీ గొయ్యి సహా నదీగర్భం, రాతికట్ట కోతకు గురవుతున్నాయని.. డ్యాం భద్రత దృష్ట్యా నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచించాయి. అయినా పాలకులు నిర్లక్ష్యం వీడలేదు. గతవైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లూ నిర్వహణపై అంతులేని నిర్లక్ష్యం.. డ్యాం పాలిట శాపంగా మారింది. చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అప్రోచ్ రోడ్డు నిర్మాణం సహా పలు మరమ్మతులకు రూ.203 కోట్లు కేటాయించింది. అయితే కొత్త సిలిండర్ల ఏర్పాటు ఈ పనుల్లో లేదు. ప్రస్తుతం వీటి కోసం అంచనాలు సిద్ధం చేస్తున్నారు. ఎంతలేదన్నా.. సిలిండర్లకు రూ.160 నుంచి 180 కోట్ల వరకు ఖర్చవుతుందని రిటైర్డ్ ఇంజనీర్లు అంటున్నారు.

పలు సంస్థల అధ్యయనాలు..: వాస్తవానికి 2009లో వచ్చిన భారీ వరదల కారణంగానే ప్లంజ్‌పూల్ గొయ్యి బాగా పెద్దదైంది. సిలిండర్లు దెబ్బతినడమే కాదు.. అప్రోచ్ రోడ్డు ఆనవాళ్లే లేకుండా కొట్టుకుపోయింది. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు సీఎం అయ్యాక ప్లంజ్‌పూల్ గొయ్యిపై 2018లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (ఎన్ఐవో) సంస్థ అధ్యయనం చేసింది. గొయ్యి 42 మీటర్లు లోతు లో ఉందని నివేదిక ఇచ్చింది. 2020 ఫిబ్రవరి 25న ఏబీ పాండ్యా సారథ్యంలో నియమించిన కమిటీ 2021లో నివేదిక ఇచ్చింది. అనంతరం నాటి ఎన్‌డీఎసఏ చైర్మన్ వివేక్ త్రిపాఠి ఆధ్వర్యంలోని నిపుణుల బృందం కూడా రిపోర్టు ఇచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎన్‌డీఎసఏ చైర్మన్ అనిల్‌జైన్ శ్రీశైలం డ్యాంను సందర్శించారు. డ్యాం రక్షణ కోసం ఏర్పాటు చేసిన 67 సిలిండర్లలో 62 పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. ప్లంజ్‌పూల్ ప్రమాదకరంగా మారిందని నిపుణులు ఇచ్చిన నివేదికలు చెబుతున్నాయని.. 2009 వరదలకు దెబ్బతిన్న డ్యాం మరమ్మతులు చేపట్టకపోవడం, నిపుణుల సూచనలకు అనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. రాష్ట్రప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. దాంతో ప్లంజ్‌పూల్ గుంత వల్ల డ్యాం ఆనకట్ట, పునాదులకు ఏ స్థాయిలో ప్రమాదం పొంచి ఉందో.. అధ్యయనం చేసేందుకు పుణేలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్‌కు అప్పగించారు. అలాగే.. డ్యాంకు రక్షణగా ఏర్పాటుచేసిన సిలిండర్ల తాజా పరిస్థితిని తెలుసుకునే బాధ్యతను విశాఖకు చెందిన సీలైన్ ఆఫ్‌షోర్ డైవింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టింది. ఈ సంస్థలు లోతుగా అధ్యయనం చేసి వేర్వేరుగా నివేదికలిచ్చాయి

# నేడు వందేమాతరంపై లోక్‌సభలో చర్చ

వందేమాతర గీతంపై సోమవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుపనున్నారు. వందేమాతర గీతం 150 సంవత్సరాల వేడుకను ఏడాది పాటు నిర్వహించుకోవడంలో భాగంగా ఈ చర్చ చేపట్టనున్నారు. ఈ జాతీయ గేయం గురించి ఇప్పటివరకు వెలుగులోకి రాని పలు కీలక విషయాలను ఈ సందర్భంగా వెల్లడించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు లోక్‌సభలో వందేమాతరంపై చర్చను ప్రారంభిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. అనంతరం రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తారు. ఎన్డీయే పక్షాలకు లోక్‌సభలో 3 గంటలు కేటాయించగా, కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ ఉపనేత గౌరవ్ గగోయ్, ప్రియాంకా గాంధీ వాద్రా సహా 8 మంది నేతలు మాట్లాడనున్నారు. అలాగే, మంగళవారం రాజ్యసభలో హెూంమంత్రి అమిత్‌షా ఈ అంశంపై చర్చను ప్రారంభించే అవకాశం ఉంది. అనంతరం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తదితరులు ప్రసంగిస్తారు. బంకించంద్ర ఛటర్జీ రాసిన ఈ గీతాన్ని 1875 నవంబరు 7న తొలిసారిగా లిటరరీ జర్నల్ బంగదర్శన్‌లో ప్రచురించారు. అనంతరం 1882లో ప్రచురితమైన తన నవల ఆనందమఠ్‌లో బంకించంద్ర ఛటర్జీ ఈ గీతాన్ని భాగం చేశారు. వందేమాతర గీతం 150 సంవత్సరాల ఉత్సవాన్ని ఏడాదిపాటు నిర్వహించుకునే కార్యక్రమాన్ని ప్రధానిమోదీ గతనెల 7న ఢిల్లీలో ప్రారంభించారు. ఏడాదిపాటు విద్యార్థులు, యువతలో జాతీయ గీతంపై అవగాహనను పెంపొందించనున్నారు. కాగా, 1937లో ఈ గీతం నుంచి కీలక చరణాలను కాంగ్రెస్ తొలగించిందని, తద్వారా దేశ విభజనకు బీజాలు నాటిందని మోదీ ఆరోపించారు. మరోవైపు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) సహా ఎన్నికల సంస్కరణలపై మంగళవారం నుంచి పార్లమెంటులో చర్చించనున్నారు. లోక్‌సభలో మంగళ, బుధవారాలు, రాజ్యసభలో బుధ, గురువారాలు ఎన్నికల సంస్కరణలపై చర్చిస్తారు. కాంగ్రెస్ నుంచి లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు, రాజ్యసభలో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడనున్నారు.

# కర్ణాటకంపై వీడని సస్పెన్స్



కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీలో అధికార మార్పిడిపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఢిల్లీలో సోనియా గాంధీ నివాసంలో శనివారం రాత్రి అధిష్టానం నేతలు సమావేశమయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో కర్ణాటక అంశాన్ని ప్రత్యేకంగా చర్చించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. అయితే సమావేశంలో ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని, రానున్న రోజుల్లో మరోసారి సమావేశమై చర్చిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, అందరూ కలసికట్టుగానే ఉన్నారని కూడా తెలిపారు. ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య రెండు బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌ల అనంతరం రాష్ట్రంలో సీఎం మార్పు అంశం తాత్కాలికంగా బ్రేకులు పడిన సంగతి తెలిసిందే.

**సంక్రాంతికి డీకేకు శుభవార్త!**

'ఐదేళ్లు నేనే సీఎం' అని చెప్పుకునే స్థాయి నుంచి 'రాజకీయాల్లో ఏదీ శాశ్వతం కాదు' అని చెప్పుకునే స్థాయి వరకూ సిద్ధరామయ్య దిగిరావడాన్ని చూస్తే, డీకే సీఎం అవ్వడం దాదాపు ఖాయం అయినట్లు పరిశీలకులు భావిస్తున్నారు. సంక్రాంతికి డీకేకు హైకమాండ్ శుభవార్త అందించనున్నట్లు కూడా రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. డీకేను ముఖ్యమంత్రిని చేస్తే వచ్చే సాధకబాధకాలపై హైకమాండ్ ప్రధానంగా శనివారం చర్చించినట్లు కూడా తెలుస్తోంది. తమ నిర్ణయాన్ని వెల్లడించకముందు మరోసారి ఇద్దరి మధ్య సయోధ్య కుదర్చాలని హైకమాండ్ భావిస్తోంది. ఇరువురి మధ్యా మరో బ్రేక్‌ఫాస్ట్ సమావేశం జరిగే అవకాశం ఉందని అంచనా. అనంతరం ఇద్దరిని ఢిల్లీకి పిలిపించి హైకమాండ్ చర్చించనున్నట్లు భావిస్తున్నారు.

వి న్యూస్
మన ఊరు - మన వార్తలు
తెలుగు దినపత్రిక

# పేరులో ఏముంది?

రాష్ట్రపతి, ప్రధానమంత్రి నుంచి ఆర్ఎస్ఎస్ సంచాలకుల వరకు సంఘ్ పరివార్ మొత్తం 'వలసవాద మనస్తత్వం' చాటున పేర్ల మార్పిడిలో నిమగ్నమై ఉందిప్పుడు. వాజ్‌పేయి నాయకత్వంలో ప్రారంభమైన 'వలసవాద మనస్తత్వం' నుండి విముక్తి పొందే ప్రక్రియ%ౌ%మరింత తీవ్రతతో దూకుడుగా సాగుతోంది. ఎనిమిది శతాబ్దాల ఇస్లామిక్ పాలన చిహ్నాలను, పేర్లను, చారిత్రక కట్టడాలను మార్చడం లేదా కూల్చడం ద్వారా భారతదేశ ప్రాచీన సాంస్కృతిక గుర్తింపును పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నట్లు దేశానికి, ప్రజలకు నిరంతరం గుర్తు చేస్తున్నారు. చరిత్రకు వక్రభాష్యాలు చెబుతున్నారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో సామ్రాజ్యవాదానికి పూర్తిగా లొంగిపోయి, తరచూ రాజకీయ సర్దుబాట్లు చేసుకున్న శక్తులు.. ఇప్పుడు తమను తాము 'వలస వ్యతిరేక పోరాట నాయకులు'గా చిత్రించుకోవడమంటే చరిత్రను మసకబార్చే ప్రయత్నమే. 'చరిత్రను రాసేవారి చేతిలో సత్యం కూడా వంగిపోతుంది' అన్న ఓ చరిత్రకారుని మాటలు దీనికి చక్కగా సరిపోతాయి. 2016లో ప్రధానమంత్రి అధికారిక నివాసం పేరును 'లోక్ కళ్యాణ్ మార్గ్'గా మార్చారు. అదేవిధంగా, రాజ్‌పథ్ పేరును 'కర్తవ్య పథ్'గా మార్చారు. తాజాగా రాష్ట్ర గవర్నర్ల అధికారిక నివాసాలైన రాజ్ భవన్‌ల పేరును 'లోక్ భవన్'గా మార్చారు. అన్ని రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ మారిపోయాయి. ఇప్పుడు ప్రధాని కార్యాలయానికి 'సేవాతీర్థం' అని నామకరణం చేయనున్నట్లు చెబుతున్నారు. నగరాలు%ౌ% వీధుల పేర్లు మార్చడం, పాఠ్యపుస్తకాలలో చరిత్రను తిరగరాయడం, శాస్త్రీయ అధ్యయనాలను నకిలీ శాస్త్రాలు, పురాణాలతో భర్తీ చేయడం చూస్తున్నాం. ఈ మార్పులన్నిటికీ ఒక్కటే ట్యాగ్‌లైన్%ౌ% 'వలసవాద మనస్తత్వం నుంచి విముక్తి'. రాజ్ అనే పదం బ్రిటిష్ కాలంలోని రాజులు, వారి పాలనకు సంబంధించినది. ఇది వలస పాలనను గుర్తు చేస్తున్నా కూడా స్వాతంత్ర్యానంతరం ఈ పేర్లను మార్చలేదు. రాజ్‌భవన్ అంటే.. గవర్నర్ నివాసం అనుకుంటున్నారు కానీ, దాని వెనుక వలసవాద బానిసత్వం వుందని ఇప్పటి తరానికి అసలే తెలియదు. ఈ అర్థం ప్రజాస్వామ్యంలో ఎవరూ పాటించరు. కానీ, గవర్నర్‌లు గీత దాటి పోతున్నారు. రాజ్యాంగాన్ని ధిక్కరిస్తున్నారు. రాజకీయాలు చేస్తున్నారు. గవర్నర్ పేరు మీద ప్రభుత్వం నడిచినా, ఆయనకు ఎలాంటి అధికారాలు వుండవని రాజ్యాంగం స్పష్టం చేస్తున్నది. కానీ, బిజెపి యేతర పార్టీలు అధికారంలో వున్న రాష్ట్రాల్లో గవర్నర్లు%ౌ% ఆయా రాష్ట్రప్రభుత్వాలకు కంటిలో నలుసుగా, కేంద్రానికి తాబేదార్లుగా మారుతున్నారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో గవర్నర్లు వ్యవహరించే తీరే దీనికి తాజా ఉదాహరణ. వీరి రాజకీయాలన్నీ రాజ్‌భవన్ వేదికగానే నడుస్తున్నాయి. గవర్నర్ల వ్యవస్థ మూలంగా ప్రజాస్వామ్యం, ఫెడరలిజం దెబ్బతింటోంది. మరి పేరు మార్పుల వల్ల ఉపయోగం ఏమిటి? భారత రాజ్యాంగ ప్రస్తావన 'వురు ది పీపుల్ ఆఫ్ ఇండియా'తో మొదలవుతుంది. లోక్ అనే పదం ప్రజలు సర్వోన్నతులని, ప్రజల భావనలు, ఆకాంక్షలకు చిహ్నమని చెబుతోంది. కానీ, బిజెపి ప్రభుత్వం%ౌ% దేశ రాజ్యాంగం, సమాఖ్య వ్యవస్థను, సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘంతో సహా అన్ని రాజ్యాంగ వ్యవస్థలను 'ఎన్నికల నిరంకుశత్వం' కిందకు తెచ్చిన ఫాసిస్టు నియంతృత్వాన్ని దేశం చూస్తోంది. మతతత్వ అజెండా అమలులో భాగంగా ఇప్పటికే ఐపిసిని సంస్కృత పదాల్లోకి మార్చింది. హిందుత్వ రాజకీయాలు, దానికి మార్గం సుగమం చేసే భావజాలం ఆయుధాలుగా మారాయి. రాజ్‌భవన్ అయినా, లోక్‌భవన్ అయినా గవర్నర్ల పాత్రలో మార్పేమీ వుండదు. సేవాతీర్థం, లోక్ కళ్యాణ్ మార్గ్, కర్తవ్యపథ్, లోక్‌భవన్ వంటి పేర్లు ప్రజల జీవితాల్లో నిజమైన దేశభక్తిని, కర్తవ్య నిబద్ధతను పెంచుతాయా? రైతుకి న్యాయం, కార్మికుడికి భరోసా, యువతకు ఉద్యోగం, పౌర స్వేచ్ఛ, మైనారిటీకి భద్రత కల్పించలేని నామకరణాలు వలసవాద మనస్తత్వాన్ని తుడవలేవు. 'ఎలుక తోలు తెచ్చి ఏడాది ఉతికినా, నలుపు నలుపే గాని తెలుపు కాదు' అంటాడు వేమన. నిజమైన 'వలస మనస్తత్వ విముక్తి' అంటే, బోర్డులపై పేర్లు మార్చడం కాదు%ౌ% వ్యవస్థల్లో మార్పు తేవడం. కేవలం పేరు మార్పుతోనే ఈ వ్యవస్థ పునీతం కాదు.

## పైడమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన పెడన ఎమ్మెల్యే దంపతులు




కృష్ణాజిల్లా పెడన పట్టణం పెడన గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ పైడమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాలు నాలుగవ రోజు సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పెడన నియోజకవర్గ శాసన సభ్యులు గౌ శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మ దయ ప్రతి ఒక్కరికి ఉండాలని భక్తులుగా ప్రజల తరపున మొక్కు బడులు చెల్లించి అమ్మదయ అందరికి ఉండాలని ఆకాంక్షించారు అనంతరం ఎంమ్మెల్యే దంపతులను ఆలయ మర్యాదలతో కమిటీ సభ్యులు మరియు కార్య నిర్వాహక అధికారి ఘనంగా సత్కరించగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆలయ అధికారులను ఆదేశించి, 11 రోజుల ఉత్సవాల ఏర్పాట్లు మరియు క్యూ లైన్ ల నిర్వహణ ఉచిత దర్శనం అందలి ఏర్పాట్లు పర్యవేక్షించి తగు సూచనలు చేశారు.

## భక్తులతో పోటెత్తిన పైడమ్మ ఆలయ ప్రాంగణం

**-నాలుగో రోజుకు చేరుకున్న శ్రీ శ్రీ పైడమ్మ అమ్మవారి ఉత్సవాలు**
**-అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకుంటున్న భక్తులు**
**-ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో కృష్ణారావు**

(వి న్యూస్ -పెడన):
శ్రీ శ్రీ పైడమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాలు నాలుగో రోజుకు చేరుకున్నాయి ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంతం భక్తజన సందోహం గా మారింది భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రానుండడంతో ఆలయ ఈవో కృష్ణారావు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు ఈ నేపథ్యంలో భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకుంటున్నారు.



## ఘనంగా పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ వార్షికోత్సవం

(వి న్యూస్ - మచిలీపట్నం)::
విద్యార్థుల పూర్తి ప్రవర్తన వారి తల్లిదండ్రుల ప్రవర్తన పై ఆధారపడి ఉంటుందని అందువల్ల తల్లిదండ్రులు ఆదర్శవంతమైన ప్రవర్తన కలిగి ఉండాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డి కె బాలాజీ పేర్కొన్నారు. స్థానిక పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ లో శనివారం రాత్రి విద్యాలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పిల్లల ప్రవర్తనలో చాలా సమస్యలు ఎదురవుతున్నాయన్నారు దీనికి కారణం తల్లిదండ్రుల పెంపకం విధానమే అన్నారు. తల్లిదండ్రులు ఎలాంటి సిద్ధాంతాలను నమ్ముకుని జీవిస్తే పిల్లలు కూడా అదే సిద్ధాంతాలు అలవాట్లు నేర్చుకుంటారన్నారు. అందువలన వారి ముందు మాట్లాడేటప్పుడు ఏదైనా పని చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో చికాగోకు చెందిన బూచ్ ఒహారా జీవిత చరిత్రను తెలియజేశారు. అదేవిధంగా విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బాలాజీ తన సతీమణి పృథ్వీ కళ్యాణి తో కలిసి హౌబహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకర్షించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఈ నెల 8న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**- మీకోసం నిర్వహిస్తాం - జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**

(వి న్యూస్ - మచిలీపట్నం)::
ఈ నెల 8న సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక- కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులుహౌమీకోసం.ఏపి.జిఓవి.ఇన్ వెబ్ సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కలెక్టర్ కోరారు.



# అభినయ నాటక పుస్తకావిష్కరణ

(వి న్యూస్, మచిలీపట్నం)
స్థానిక మహతి కళావేదిక లో భావతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో భవిష్య రచించిన అభినయ సాంఘిక నాటక పుస్తకావిష్కరణ ఆదివారం సాయంత్రం జరిగింది. ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, సాహిత్య వేత్త డాక్టర్ ధన్వంతరి ఆచార్య, ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, భావ తరంగిణి గౌరవాధ్యక్షులు కె. కృష్ణమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. ఆవిష్కరణ అనంతరం ప్రేక్షకులే సమీక్షకులు అని రచయిత ప్రకటించి వెంటనే అభినయ నాటక ప్రదర్శన నిర్వహించడం వినూత్నమైన ఆలోచన. ప్రముఖ సాహితీవేత్త శ్రీ కొప్పరపు నారాయణ మూర్తి, చార్టర్డ్ అకౌంటెంట్ బి.వి.వి.సత్యనారాయణ, రచయిత్రి గుడిపూడి రాధికారాణి,తెలుగు భాషా సమాఖ్య కార్యదర్శి అప్పినేడి పోతురాజు,ఆర్టీసీ డి.ఎం.పెద్దిరాజు,ప్రముఖ గాయని కాళీపట్నపు ఉమ,కవయిత్రి మాదిరాజు శివలక్ష్మి తదితరులు అభినయను వీక్షించి సమీక్షించారు. సాహితీ ప్రియులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**అద్భుతం అభినయ నాటకం**

స్థానిక మహతి కళావేదికలో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన అభినయ సాంఘిక నాటకం పలు ప్రత్యేకతలతో ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. భావ తరంగిణి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నాటక రచయిత భవిష్య దర్శక నిర్వాహణలో ప్రదర్శించిన అభినయ నాటకం అద్యంతం ఆసక్తికరంగా సాగింది నాటకం మొదటి నుంచి చివరి వరకు మన కళా రంగం విశిష్టత ప్రాధాన్యత అవసరం అలాగే మన విలువైన సాహితీ సంపదను పరిరక్షించుకోవాలి అనే కథాంశంతో జరిగింది కళాకారులకు ఉత్సాహాన్ని ప్రోత్సాహాన్ని కలిగించేలా నాటకం ఉందని పలువురు తమ భావాన్ని వ్యక్తం చేశారు అలాగే నాటకంలో మొదట పల్లె



వాతావరణం ఒక వృద్ధురాలు పాటని ఏ ఐ ద్వారా పాడిచ్చి ప్రదర్శించారు "పల్లె అందాలన్నీ పోయే నగరాల నాగరికత వచ్చే రోళ్ళు పోయే రోకళ్ళు పోయే కోడళ్ళ కాళ్ళకేమో కీళ్ల నిప్పులాయే... " జానపద తరహాలోని ఈ పాటను ఏఐ ద్వారా పాడించి అక్కడ ప్రదర్శనలో అభినయించారు . మొత్తం నాటకంలో పాటలు కూచిపూడి నాట్యము వయోలిన్ వాద్యం అన్ని ఉండటంతో నవరసభరితంగా సాగింది మరో విశేషమేమంటే నాటకంలో పి .శాంతి 80 ఏళ్ల నాయినమ్మ గా 50 ఏళ్ల తల్లి గా 20 ఏళ్ల హీరోయిన్ గా త్రిపాత్రాభినయం చేయటం హైలైట్ గా ఉంది మరో పాత్రధారి రావినూతల సత్యనారాయణ పద్మనాభరావు పాత్రధారిగా పాత్రికేయుడుగా పాల అబ్బాయిగా మూడు పాత్రలను చక్కగా పోషించారు ఇంకా నాటకంలో దండిభోట్ల దత్తాత్రేయ శర్మ ప్రముఖ నాట్యాచార్యులుపాత్రధారిగా, యల్లాప్రగడ శ్రీరామ్ సినీ డైరెక్టర్ గా, ఆర్ వెంకటేశ్వరరావు హాస్య పాత్రధారిగా, ప్రముఖ వైద్యులు డాక్టర్ ధన్వంతరి డాక్టరు పాత్ర మరియు సాహితీవేత్త పాత్రధారిగా, అద్దేపల్లి సత్య మల్లికార్జున ప్రసాద్ హీరోగా ,కోసూరు ఈశ్వరరావు కవి పాత్రధారిగా, వై హరిణి కూచిపూడి నాట్య కళాకారునిగా, జె.కృష్ణ కౌండిన్య దత్ బాల నటుడుగా తమ తమ పాత్రలకు న్యాయం చేకూర్చినాటకాన్ని విజయవంతం చేశారు.

## తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

(వి న్యూస్ -పెడన):
పెడన మండలం పెనుమల్లి హరిజనవాడ లో చనిపోయిన తండ్రికి తలకొరివి పెట్టిన కుతురు గ్రామానికి చెందిన వల్లభు ఏడుకొండలు (56 ) అనారోగ్యం తో చనిపోయాడు. అతనికి కొడుకులు లేరు. ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చనిపోయిన తండ్రికి తాను తలకొరివి పెడతానంటూ మూడవ కుమార్తె కళ్యాణి ముందుకు వచ్చింది. పెద్దల సహాయంతో తండ్రి అంత్యక్రియలు పూర్తి చేసింది. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అర్జా నగేష్ కూడా పాల్గొన్నారు



V స్మార్ట్ యాడ్స్

**Insurance**
యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించబడును. ఇన్సూరెన్స్ చేయించుకోదలచిన వారు సంప్రదించండి: టి.సి.ఎన్ శ్రీనివాస్. 9246761404 08672-221097

**మస్కిటో డోర్స్&విండోస్**
చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్... అల్యూమినియమ్ మస్కిటో డోర్స్&విండోస్ తయారు చేయబడును. మరియు రిపేర్ చేయబడును. సంప్రదించండి: చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్ గొడుగుపేట-మచిలీపట్నం సెల్:9182197822 9121605277

**శ్రీ విఖనస జ్యోతిషాలయం**
విద్య, ఉద్యోగము, వివాహం సంతానం, ఆర్థిక సమస్యలకు జాతకరీత్యా పరిహారము సూచించబడును. గృహ వాస్తు సమస్యలు నూతన గృహ ప్లాన్ వేయుటకు దేవాలయముల నిర్మాణములకు విగ్రహ ప్రతిష్ఠలకు సంప్రదించవలసిన చిరునామ శ్రీ ముత్తేవి శ్రీనివాస శశికాంత్ పంచాంగ కర్త, జ్యోతిష, వాస్తు సిద్ధాంతి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం దగ్గర బచ్చుపేట, మచిలీపట్నం సెల్ : 9440440312

**వి స్మార్ట్ యాడ్స్ కేవలం రూ.100/-లకే స్మార్ట్ యాడ్..**
సంప్రదించండి 9848667347

**అద్దెకు ఇవ్వబడును**
జిల్లా కోర్టు సాయిబాబాగుడి ఎదురురోడ్డులో తూర్పు ఫేస్‌లో 1,2 ఫ్లోర్లలో కమర్షియల్ స్పేస్ అద్దెకు ఇవ్వబడును. బ్యాంకులకు, డాక్టర్లకు మొ॥లగు వారు సంప్రదించండి. లిఫ్ట్ సౌకర్యం కలదు. సంప్రదించండి: 7997883575 9347576464 9515237110

**చెదల నివారణకు**
K. Vasantha Rao
DAYA PEST CONTROLLING WORK
Cell: 8333099449
నివారణ గ్యారెంటీ... మచిలీపట్నం.

**శ్రీ శివరామకృష్ణ జ్యోతిష్యాలయము**
శంకర మఠం ప్రక్కన, గొడుగుపేట, మచిలీపట్నం.
జాతక పరిశీలన చేసి వివాహ, ఉద్యోగ, వ్యాపార, సంతాన తదితర విషయాల్లో దోషాలకు పరిహారాలు సూచింపబడును.
వివాహ పొంతన పరిశీలింపబడును. సుముహూర్త నిర్ణయం చేయబడును.
సంప్రదించండి : 96407 54054-91828 17435

**మచిలీపట్నం పరిసర ప్రాంత ప్రజలకు సదవకాశం**
వాటర్ సర్వీసింగ్ & ఇంజన్ ఆయిల్ (జనరల్ సర్వీస్‌తో)
కేవలం రూ. 449/-లకే బైక్ జాబ్ కార్డు ఇవ్వబడుతుంది.
ప్రతి ఒక్కరు ఈ అవకాశమును వినియోగించుకోవలసినదిగా మనవి.
నందిని ఆటోమొబైల్
అన్నిరకముల టూవీలర్ స్పేర్ పార్ట్స్ & ఇంజన్ ఆయిల్స్ మరియు టైర్లు లభించును.
సెల్ : 7396 7396 79
నవరంగ్ ఆటో కన్సల్టెన్సీ
లక్ష్మీటాకీస్ సెంటర్, డి-మార్టు రోడ్, మచిలీపట్నం - 521 002.
సెల్ : 9848520822

**స్థలం అమ్మబడును.**
డోకిపర్రు వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో నిడుమోలు-కౌతవరం మెయిన్ రోడ్డులో 16సెంట్ల భూమి అమ్మకానికి కలదు. 60-120 సైజులో గల కమర్షియల్ భూమి కావల్సిన వారు వెంటనే సంప్రదించండి: సంప్రదించండి: 7997883575 9347576464

**తక్కువధరకే ప్రకటనలు**
ఇల్లు/స్థలం అమ్మలన్నా, కొనాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా, ఉద్యోగం కావాలన్నా, ఉద్యోగులు కావాలన్నా తక్కువ ధరతో విన్యూస్‌లో ప్రకటన ఇచ్చి నిశ్చింతంగా ఉండండి. మరిన్ని వివరాలకు సంప్ర: 9848667347

**SALE.. SALE**
3 BHK apartment sale. Open kitchen, cupboards, car parking, balcony grills with roof sheets, Lift & generator @ Bhaskarapuram, Machilipatnam. Cell:9110382362

**ఆయా కావలెను.**
హైదరాబాద్‌లో ఉండి ఏడాది బాబును చూస్తూ వంట చేసేందుకు ఏ బాదరబందీ లేని మహిళ కావలెను. అనుభవం బట్టి జీతం ఇవ్వబడును. సంప్రదించండి. సంప్రదించండి: 7032931205

**TOLET**
కృష్ణాజిల్లా మచిలీపట్నం జల్లువారి తోట ఈడేపల్లిలో జిల్లాకోర్టువెనుక నూతనంగా నిర్మించిన అన్ని సౌకర్యాలు గల సింగిల్ బెడ్ రూమ్‌హౌస్ అద్దెకివ్వబడును. కావలసిన వారు సంప్రదించండి. సంప్రదించండి: 7032931205

**పొలం అమ్మబడును.**
కృష్ణాజిల్లా మచిలీపట్నం మంగినపూడి బీచ్ రోడ్ నుండి 216 జాతీయ రహదారిని కలుపు బైపాస్ రోడ్డుకు గల 4 ఎకరాల భూమి అమ్మకమునకు కలదు. కావలసిన వారు సంప్రదించండి. సంప్రదించండి: 8328157785 9848038131

# మచిలీపట్నం వడ్రంగి పనివారల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



**(వి న్యూస్ - మచిలీపట్నం)::**
జగన్నాధపురం జగన్నాథ స్వామి దేవాలయంలో మచిలీపట్నం వడ్రంగి పనివారల నూతన సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా సంఘ లీగల్ అడ్వైజర్హా లంకిశెట్టి బాలాజీ పాల్గొన్నారు. వడ్రంగి పనివారల సంఘం గౌరవ సలహాదారులుహాగడ్డం రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హాఅధ్యక్షులు గా కొరగంటి కాంతారావు ప్రధాన కార్యదర్శి గా పరసా లక్ష్మీనారాయణ కార్యవర్గ సభ్యులచే సంఘ నిబంధన మేరకుహాలంకిశెట్టి బాలాజీ సభ్యులచే ప్రమాణం చేయించారు. తరువాత లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ నూతన కార్యవర్గం సంఘ అభివృద్ధికి కృషి చేయాలని 500 మంది సభ్యులు కలిగిన మచిలీపట్నం వడ్రంగి పని వారలసంఘం ఆదర్శంగా నిలవాలని తెలిపారు పనిలో నీతి నిజాయితీ గా వ్యవహరించి గృహ నిర్మాణదారుల మన్ననలు పొందాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేలా కృషి చేయాలని మచిలీపట్నంలో వడ్రంగి పనివారల కోసం ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా అర్హులైన వడ్రంగి పని వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని స్కిల్ డెవలప్మెంట్ సంస్థ ద్వారా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని మచిలీపట్నంలో ఎంతో నైపుణ్యం కలిగిన వడ్రంగి పని వారు ఉన్నారని ఇతర రాష్ట్రాలలో ఇతర జిల్లాలలో మచిలీపట్నం వడ్రంగి పని వారిచే తయారు కాబడిన కళాఖండాలు ఉన్నాయని బాలాజీ పేర్కొన్నారు. సంఘ అధ్యక్షులు కాంతారావు మాట్లాడుతూ వడ్రంగి పనివారల సంక్షేమ భవన్ కు స్థలం కేటాయించాలని వడ్రంగి పనివాళ్ల కొరకు కాలనీ ఏర్పాటు ప్రభుత్వం నుండి సబ్సిడీ రుణాలు అందించి ఆధునిక పరికరాల కొనుగోలుకు సహకారం అందించాలని తెలిపారు. హా సంఘ గౌరవ సలహాదారుడు గడ్డం రాజు మాట్లాడుతూకూటమి ప్రభుత్వం చేతివృత్తి దారులకు చేయూతనిస్తుందని వడ్రంగి పనివాళ్ల సంక్షేమ భవన్ స్థల ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పార్లమెంట్ సభ్యులు, బాలశౌరి రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ , కొనకళ్ళ నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ దృష్టికి తీసుకు వెళ్తానని సంఘ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్రంగి పనివారల సంఘ ప్రతినిధులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# 287 రైతు సేవ కేంద్రాల ఏర్పాటు : జేసీ



**వి న్యూస్ - మచిలీపట్నం)::**
కృష్ణా జిల్లా సంయుక్త కలెక్టర్ హాజిల్లాలో ఖరీఫ్ 2025–26 సీజనుకు గాను ధాన్యము సేకరణ చేయుటకు 287 రైతు సేవ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కృష్ణా జిల్లాలో గత సంవత్సరం ఈ రోజుకి 1,82,405 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయగా ఈ సంవత్సరం 2,46,473 మెట్రిక్ టన్నుల ధాన్యమును 29,668 మంది రైతుల వద్ద నుండి సేకరణ చేసి 502.50 కోట్ల రూపాయలు రైతుల 48 గంటలలో రైతుల ఆధార్ కు అనుసంధానం అయిన రైతు బ్యాంక్ ఖాతాలో నేరుగా జమ చేయడం జరిగిందన్నారు.రైతుల వద్ద నుండి ధాన్యము సేకరణ చేయుటకు నేటి వరకు 72,98,622 గోనె సంచులు జిల్లాలోని రైతు సేవ కేంద్రముల వద్ద రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. హాజిల్లాలోని ధాన్యమును మిల్లులకు తరలించుటకు 4,199 వాహనములను అందుబాటులో ఉంచాలన్నారు. రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయుటకు జిల్లా, డివిజన్, మండల మరియు గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి వారితో నిరంతరం సమీక్షలు నిర్వహించడం తో పాటుగా క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యటించి ధాన్యం సేకరణ లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకొనుటకు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు , సూచనలు ఇవ్వడమైనదన్నారు. ఈ ఖరీఫ్ సీజనులో కనీస మద్దతు ధర (ఎమ్ ఎస్ పి) ప్రతి క్వింటాల్ ధాన్యముకు సాధారణ రకం రూ. 2,369/– చొప్పున , గ్రేడ్– ఏ రకానికి రూ. 2,389/– చొప్పున ప్రతి రైతునకు పూర్తి పారదర్శకంగా నేరుగా వారి బ్యాంకు అక్కౌంట్ కు ఆధార్ నెంబరు ఆధారముతో జమ చేయడం జరుగును అని తెలియజేశారు. హావాతావరణము అనుకూలముగా ఉన్నందున జిల్లాలోని రైతులందరూ పరిపక్వం లేని ధాన్యమును ఎట్టి పరిస్థితులలో కోతలు కోయరాదనిహా, పరిపక్వము చెందిన ధాన్యమును పూర్తిగా ప్రభుత్వము వారు నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఆరబెట్టుకుని శుద్ధి చేసుకుని రైతు సేవా కేంద్రము ద్వారా విక్రయించి కేంద్ర ప్రభుత్వము వారు నిర్దేశించిన కనీస మద్దతు ధర పొందవలసిందిగా కోరారు. మద్దతు ధర పొందుటకు పాటించవలసిన నాణ్యతా ప్రమాణాలు నాణ్యతా ప్రమాణాలు. మూడు ఎ –హాస్యర్థి సనార్థాలు మట్టి పెల్లలు మొంక వెర్రె వేగే గనగాహాకృష్ణా జిల్లాలోని రైతులకు ధాన్యము విక్రయించుటలో ఎటువంటి సలహాలు , ఫిర్యాదుల కొరకు సంబంధిత రైతు సేవ కేంద్రము సిబ్బందిని, మండల , డివిజన్ స్థాయి అధికారులను సంప్రదించవలెనన్నారు. వారి వద్ద సమస్య పరిష్కారం కాని యెడల జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ 8247693551హాను సంప్రదించవలెనని హాతెలిపారు.


# పగుళ్లతో పరేషాన్!



శీతాకాలంలో వీచే చలిగాలులకు దగ్గు, జలుబు, జ్వరంతోపాటు పిల్లల్లో పెదాలు పొడిబారడం, పెద్దల్లో పాదాలకు పగుళ్లు రావడం లాంటి సమస్యలు తరచుగా కనిపిస్తాయి. కాలి మడమల్లో పగుళ్లు సాధారణమే అయినా నివారణ చర్యలు తీసుకోకపోతే సమస్య తీవ్రమవుతుంది. సహజంగానే పాదాల చర్మంలో నూనె గ్రంథులు తకువగా ఉంటాయి. శీతాకాలంలో ఈ నూనెలు మరింత తగ్గడంతో మడమల దగ్గర పగుళ్లు ఏర్పడతాయి. వయసు పెరిగే కొద్దీ చర్మం దాని స్థితిస్థాపకతను కోల్పోతుంది. సహజ నూనెల ఉత్పత్తి సైతం తగ్గుతుంది. దీనివల్ల పెద్దవాళ్లలో ఈ సమస్య తీవ్రంగా ఉంటుంది.

మరోవైపు వాతావరణం చల్లగా ఉండటం, తగినంత నీరు తాగకపోవడం మూలంగా శరీరంలో తేమ లోపించి మడమల పగుళ్లకు దారి తీస్తుంది. మడమలు పగిలిన భాగంలో చర్మం పొకులు పొకులుగా లేచి రాత్రి పూట పడుకున్నప్పుడు బెడ్ షీట్ తగిలినా నొప్పిలేస్తుంది. మట్టిలో తిరిగే వారికి బాధ మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ పగుళ్ల సమస్యతో మహిళలే ఎకువగా ఇబ్బంది పడుతుంటారు. వీటి నుంచి మీ పాదాలు రక్షించుకోవడానికి రోజూ పాదాలను గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకోవాలి. వాతావరణంతో సంబంధం లేకుండా సరిపడా నీళ్లు తాగాలి. దీనివల్ల చర్మం పొడిబారకుండా ఉంటుంది. రోజుకు రెండుసార్లు పాదాలకు మాయిశ్చరైజర్ రాసుకోవాలి. వృద్ధులు, మధుమేహ బాధితులు రాత్రిపూట సాక్సులు ధరించడం వల్ల చలిగాలి నుంచి తప్పించుకోవచ్చు. వేడి నీటితో కాకుండా గోరు వెచ్చని నీటితో స్నానం చేయడం ఉత్తమం. ఆహారంలో ఒమేగా ఫ్యాటీ ఆమ్లాలు ఉండే విత్తనాలు, గింజలు, విటమిన్ సి కలిగిన పండ్లు తీసుకుంటూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఉంటే పగుళ్లు మాయం అవుతాయి.

# చాట్‌బాట్‌తో.. ముప్పు!



ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాక సంచలనం. వినియోగం ప్రభంజనం. సృష్టించిన ఉద్యోగుల పాలిట శాపం. అంతేకాదు వినియోగదారులకూ ఓ రోగమని ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారు. ఏఐ ప్రభావం వల్ల మానసిక సమస్యలు వస్తున్నాయని సైకాలజిస్టులు హెచ్చరిస్తున్నారు. ఏఐ సాంకేతిక వినియోగం అన్ని రంగాల్లోకీ విస్తరించింది. ఇందులో సంభాషణ కోసం ఉపయోగించే చాట్‌బాట్‌ల వినియోగం మనుషుల ఆలోచన, ప్రవర్తనపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నదని గుర్తించారు.

సోషల్ మీడియా కంటెంట్‌కి భిన్నంగా ఆ వ్యక్తి అవసరం, ఆసక్తికి అనుగుణంగా సమాచారాన్ని సేకరించి ఇచ్చే చాట్‌బాట్‌లతో సంభాషణల్లో వక్రీకరణ, అర్ధ సత్యాలే ఉంటాయని ఇంతవరకూ గుర్తించారు. చాట్‌బాట్‌లు మనిషికి ఒక తోడులా సలహాలూ కూడా ఇస్తున్నాయి. ఈ డిజిటల్ సాహచర్యం మానసిక ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నది.

కొంతమంది మానసికవ్యాధులకు ఏఐ చాట్‌బాట్‌ల వినియోగం కారణమవుతుందని కొన్ని అధ్యయనాలు గుర్తించాయి. ఈ చాట్‌బాట్‌లు చెప్పే ముచ్చట్లూ ఆత్మహత్యల్ని ప్రేరేపిస్తున్నాయని మానసిక నిపుణులు చెబుతున్నారు. చాట్‌బాట్‌లు చెప్పే విషయాలు వినియోగదారులను ఏ మేరకు ప్రభావితం చేస్తున్నాయి, ఎంతమందిపై ఏ స్థాయిలో వీటి ప్రభావం ఉందో తెలుసుకునేందుకు ఇప్పటి వరకు కచ్చితమైన అధ్యయనాలు జరగలేదు. అందువల్ల ఏఐ చాట్‌బాట్‌ల ముచ్చట్లతో కాస్త జాగ్రత్తగా ఉండాలని సైకాలజిస్టులు హెచ్చరిస్తున్నారు.

# రోజూ ఈ ఆహారాలను తినండి..

## మీ జుట్టు వేగంగా పెరుగుతుంది.. జుట్టు అసలు రాలదు..



ప్రస్తుతం చాలా మంది అనేక రకాల జుట్టు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. వాటిల్లో జుట్టు రాలడం కూడా ఒకటి. జుట్టు రాలిపోయేందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. థైరాయిడ్, ఒత్తిడి, ఆందోళన, కాలుష్యం, దీర్ఘకాలిక వ్యాధులు ఉండడం, మందులను అధికంగా వాడడం వంటి వాటితోపాటు పోషకాహార లోపం వల్ల కూడా ఈ సమస్య వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం చాలా మంది సరైన ఆహారాలను తినడం లేదు. బయటి ఫుడ్‌ను ఎక్కువగా తింటున్నారు. దీని కారణంగా చాలా మందిలో పోషకాహార లోపం సమస్య తలెత్తుతోంది. ఇది జుట్టు రాలేందుకు కారణం అవుతోంది. అయితే రోజూ మనం తినే ఆహారాల విషయంలో పలు మార్పులు చేసుకుంటే జుట్టు రాలే సమస్యను చాలా సులభంగా తగ్గించుకోవచ్చు. మనం తినే ఆహారాలే మన జుట్టు పెరుగుదలను ప్రభావితం చేస్తాయి. కనుక పోషకాలు ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది.

**ఆకుకూరలు..**

జుట్టు రాలిపోయేందుకు ప్రధాన కారణం మన శరీరంలో తగినంత మోతాదులో మినరల్స్ లేకపోవడమే అని చెప్పవచ్చు. ముఖ్యంగా ఫోలేట్, ఐరన్‌తోపాటు విటమిన్లు ఎ, సి తక్కువగా ఉండడం లేదా లోపం వల్ల జుట్టు రాలిపోతుంది. కనుక ఈ పోషకాలు మనకు లభించేలా చూసుకోవాలి. ఇందుకు గాను రోజూ పాలకూర జ్యూస్‌ను తాగాలి. పాలకూరలో అధికంగా పోషకాలు ఉంటాయి. ఇందులో ఉండే విటమిన్లు ఎ, సి, క్యాల్షియం, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తాయి. కనుక రోజూ పాలకూర జ్యూస్‌ను తాగుతుంటే ఫలితం ఉంటుంది. అలాగే రోజూ దాల్చిన చెక్కను ఆహారంలో భాగం చేసుకుంటే జుట్టు పెరుగుదలకు ఎంతో దోహదం చేస్తుంది. దాల్చిన చెక్క పొడిని మీరు తినే ఆహారాలపై చల్లి తినవచ్చు. లేదా ఈ చెక్కను నీటిలో వేసి మరిగించి తాగవచ్చు. దీని వల్ల కేవలం జుట్టు పెరగడమే కాకుండా షుగర్, కొలెస్ట్రాల్ లెవల్స్ అదుపులో ఉంటాయి.

**గింజలు, విత్తనాలు..**

ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉండే గింజలు, విత్తనాలను రోజూ తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ముఖ్యంగా బాదంపప్పు, పిస్తా, వాల్ నట్స్, జీడిపప్పు, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, అవిసె గింజలు, చియా సీడ్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు జుట్టు పెరుగుదలకు దోహదం చేస్తాయి. అలాగే గుండెను కూడా ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ గింజలు, విత్తనాల్లో విటమిన్ ఇ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జుట్టును సంరక్షిస్తుంది. శిరోజాలు పెరిగేలా చేస్తుంది. అలాగే సోయాబీన్ ఉత్పత్తులను తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. సోయా టోఫు, సోయా పాలు, సోయా గింజలను తీసుకోవాలి. వీటిల్లో ఉండే క్యాల్షియం, ఐరన్, ఇతర పోషకాలు జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. జుట్టు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.

**కోడిగుడ్లు, చేపలు..**

రోజూ ఒక కోడిగుడ్డును ఆహారంలో భాగం చేసుకుంటే శరీరానికి బయోటిన్ అధికంగా లభిస్తుంది. ఇది జుట్టు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. కోడిగుడ్లలో ప్రోటీన్లు, జింక్, సెలీనియం అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి కూడా శిరోజాలను సంరక్షిస్తాయి. అలాగే వారంలో కనీసం 2 సార్లు చేపలను తింటున్నా ఉపయోగం ఉంటుంది. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఇతర ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్ డి ఉంటాయి. ఇవన్నీ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. ఇలా ఆయా ఆహారాలను రోజూ తీసుకుంటే జుట్టు రాలడాన్ని తగ్గించుకోవచ్చు. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే అన్ని పోషకాలు లభించి ఆరోగ్యంగా ఉంటారు. ఇతర అనారోగ్య సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు.

Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO:TELAP/2015/65279